

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -పాడేరు: బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ ఆద్వర్యంలో జువనైల్ జస్టిస్ (పిల్లల రక్షణ, సంరక్షణ) చట్టం 2015, సవరించబడిన చట్టం 2021 ప్రకారం కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలో చైర్పర్సన్లు, మెంబర్లుగా, జువనైల్ జస్టిస్ బోర్డుల్లో సోషల్ వర్క్ మెంబర్లుగా సేవలు అందించుటకు గాను అర్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బాలల సంక్షేమ, సంస్కరణల సేవల శాఖ జిల్లా పరివీక్షణాధికారి వై. చిరంజీవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ధరఖాస్తులను నిర్దేశిత ప్రొఫార్మాలో అర్హతలతో ఈ నెల 13వ తేదీలోపు విజయవాడలోని ఈ శాఖ డైరెక్టర్ కార్యాలయానికి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను స్పీడ్ పోస్ట్ లేదా రిజిస్టర్ పోస్ట్లో మాత్రమే పంపాలని, ఈ మెయిల్స్ దరఖాస్తులు లేదా అసంపూర్తి దరఖాస్తులు అంగీకరించబడవని తెలిపారు. 35 నుండి 65 సంవత్సరాల మధ్య వయసు కలిగి, పిల్లల సేవలో అనుభవంతో పాటు ఇతర అర్హతలు ఉన్న అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగ పరిచుకోవాలని ఆయన కోరారు. ఇతర సమాచారంకు వై. చిరంజీవి, జిల్లా పరివీక్షణ అధికారి ఫోన్: 96661 20169 నెంబర్ సంప్రదించవచ్చని తెలిపారు.

ఏలూరు జిల్లాలో ముగిసిన పాదయాత్ర



కృష్ణా జిల్లాలోకి ప్రవేశం
ధైర్యం చెబుతూ అండగా ఉంటామని నేతల భరోసా
దారి పొడవునా టిడిపి, జనసేన, కాంగ్రెస్, బిఎస్పి, ప్రజాసంఘాల మద్దతు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాగుతున్న పోలవరం పోరుకేక పాదయాత్ర శనివారం జిల్లాలో ముగిసింది. హనుమాన్ జంక్షన్ వద్ద కృష్ణా జిల్లాలోకి ప్రవేశించింది. జూన్ 26వ తేదీ నుంచి జులై ఒకటో తేదీ వరకూ ఆరు రోజులపాటు జిల్లాలో యాత్ర సాగింది. తొలిరోజు 26వ తేదీ అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం గ్రామం నుంచి గోదావరి దాటి వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట వద్ద ఏలూరు జిల్లాలోకి ప్రవేశించింది. అక్కడ నుంచి కుక్కునూరు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం, ఏలూరు మండలాల్లోని 25 గ్రామాల మీదుగా యాత్ర సాగింది. పోలవరం నుంచి బుట్టాయగూడెం వరకూ ఉపయాత్ర నిర్వహించారు. మొత్తంగా 135 కిలోమీటర్ల మేర జిల్లాలో పాదయాత్ర సాగింది. మొత్తం 17 చోట్ల సభలు, ఆరుచోట్ల బహిరంగ సభల్లో నాయకులు మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర నాయకులు తరలొచ్చి యాత్రకు సంఘీభావం తెలపడమే కాకుండా, పాదయాత్రతో కలిసి అడుగులు వేశారు. తొలిరోజు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం, వి.వెంకటేశ్వర్లు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి పాల్గొనగా, రెండోరోజు ప్రత్యేక హోదా సాధన కమిటీ కన్వీనర్ చలసాని శ్రీనివాస్, మాజీ ఎంఎల్ఎ చందా లింగయ్యదొర తమ మద్దతు ప్రకటించారు. మూడో రోజు కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్ సింగ్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, పాల్గొనగా, నాలుగో రోజు ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కె.ధనలక్ష్మి, ఐదోరోజు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఆరోరోజు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, బిఎస్పి నాయకులు నేతల రమేష్తోపాటు పలువురు నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

టిడిపి, జనసేన, కాంగ్రెస్, బిఎస్పి, ప్రజాసంఘాల మద్దతు

పోలవరం పోరుకేక పాదయాత్రకు టిడిపి, జనసేన, కాంగ్రెస్, బిఎస్పి నాయకులు ప్రతి మండలంలోను ఎదురేగి పోరుయాత్ర బృందానికి మద్దతు ప్రకటించారు. టిడిపి, జనసేన మండలాధ్యక్షుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, స్వాగతం పలకడమే కాకుండా పాదయాత్రతో కలిసి నడిచి సభల్లో పాల్గొన్నారు. జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్ఛార్జి బొరగం శ్రీనివాస్ మద్దతు పలకగా, జంగారెడ్డిగూడెంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కిసాన్సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు, ఏలూరులో టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి బడేటి చంటి మద్దతు తెలిపారు. జనసేన పోలవరం నియోజకర్గ ఇన్ఛార్జి చిర్రి బాలరాజు, ఏలూరు నియోజకవర్గ ఇన్ఛార్జి రెడ్డి అప్పలనాయుడు పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు. సిఐటియు రాష్ట్ర, జిల్లా నాయకులు, ఆశావర్కర్స్ యూనియన్, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఎల్ఐసి ఏజెంట్లు యూనియన్, ఐలు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్, గిరిజన సంఘాలు పెద్దఎత్తున మద్దతు పలికాయి. విశాఖపట్నం, కాకినాడ, పశ్చిమగోదావరి జిల్లా తదితర ప్రాంతాల నుంచి పాదయాత్ర బృందానికి మద్దతు పలికేందుకు ప్రజాసంఘాల నేతలు తరలొచ్చారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై నాయకుల మండిపాటు

జిల్లాలో ఆరు రోజుల పాటు సాగిన పోరుకేక పాదయాత్రలో పాల్గొన్న నాయకులు నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం హామీ ఇచ్చిన పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలు, భూపరిహారం రూ.ఐదు లక్షలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరద పరిహారం రూ.పది వేలు తక్షణం అందించాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఇవ్వాలని, నిర్వాసిత కాలనీల్లో తాగునీరు, బడులు, ఆసుపత్రులు, శ్మశాన వాటికలు వంటి కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం వెంటనే నిధులు విడుదల చేసి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. పాదయాత్రకు నిర్వాసితుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ప్రతి గ్రామంలోనూ పాదయాత్ర రథసారథి వి.శ్రీనివాసరావుకు వినతుల రూపంలో తమ సమస్యలను తీసుకొచ్చారు. నిర్వాసితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల నాలుగో తేదీ విజయవాడలో జరగనున్న బహిరంగ సభ తర్వాత అన్ని పార్టీలనూ కలుపుకుని కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ప్రతి గ్రామాన్నీ సమర క్షేత్రంగా మారుస్తామని హెచ్చరించారు.



వట్లూరులో రోడ్డుపక్కన సేదతీరుతున్న నేతలు



ఏలూరు సభలో విల్లు ఎక్కుపెట్టిన నేతలు

ఏలూరు నగరంలో మార్మోగిన 'పోరుకేక'

ఏలూరు ప్రతినిధి, ఏలూరు అర్బన్:పోలవరం పోరుకేక యాత్రతో శనివారం ఏలూరు నగరం దద్దరిల్లింది. తంగెళ్లమూడిలో ప్రారంభమై ఏలూరు నగరం మీదుగా హనుమాన్ జంక్షన్ వరకూ సాగింది. పాదయాత్రకు అడుగడుగునా వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజలు నీరాజనాలు పలికారు. టిడిపి, జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జులు బడేటి చంటి, రెడ్డి అప్పలనాయుడు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, బిఎస్పి నాయకులు నేతల రమేష్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్రావు మద్దతు ప్రకటించారు. ఎల్ఐసి ఏజెంట్ల యూనియన్, చేతివృత్తిదారుల సంఘం, ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు తమ పూర్తి మద్దతు ప్రకటిస్తూ పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు. తంగెళ్లమూడి, పన్నెండు పంపలు సెంటర్, పవర్ పేట రైల్వేస్టేషన్, ఆర్ఆర్పేట, ఫైర్స్టేషన్, వట్లూరు మీదుగా ఈయాత్ర సాగింది. ఆర్ఆర్పేట పార్క్ వద్ద జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, బిఎస్పి నాయకులు నేతల రమేష్, కాంగ్రెస్ నాయకులు రాజనాల రామ్మోహన్రావు, సిపిఎం నాయకులు వి.ఉమామహేశ్వరరావు, సిఐటియు ఆలిండియా ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడారు. పాదయాత్రకు టిడిపి నాయకులు బడేటి చంటి రూ.పది వేలు విరాళం ప్రకటించగా, చేతివృత్తిదారుల సంఘం నాయకులు పిచ్చుకల ఆదిశేషు తమ సంఘం తరపున రూ.11,300 విరాళంగా పాదయాత్ర నాయకులకు అందించారు.



నేతలకు స్వాగతం పలుకుతున్న మహిళలు



విరాళాలు స్వీకరిస్తున్న ఉమామహేశ్వరరావు, నాయకులు

పాదయాత్రకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:సిపిఎం పోలవరం పోరుకేక పాదయాత్రకు మద్దతుగా అరకులోయలో సిఐటియు ఆధ్వర్యంలో శనివారం సంఘీభావ నిధిని కార్మికుల వద్ద సేకరించామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన గ్రామాలు ముంపునకు గురువుతున్నా నష్టపరిహారం చెల్లించాలనే ఆలోచన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని తెలిపారు. ముంపునకు గురవుతున్న గిరిజనులకు పునరావాసం కల్పించి, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలవరం పోరు కేక పాదయాత్రకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కె రామచందర్, నందీశ్వరరావు, సింహాచలం, గౌర్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: పోలవరం నిర్వాసితుల పోరు కేక మహా పాదయాత్రకు స్థానిక సిపిఎం నాయకులు శనివారం సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్బి పోతురాజు, మండల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సంఘీభావ నిధి విరాళాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పరిహారం ఇవ్వాలన్నారు. గోదావరి వరద నుండి రక్షించడానికి ప్రభుత్వాలు ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని, వరదల కారణంగా నష్టపోయిన వారందరికీ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు వి సింహాచలం, వి.మహేశ్వరరావు, పి.దొంబు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

- పోరుకేక పాదయాత్రలో సిపిఎం జెడ్పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు నేతృత్వంలో సాగుతున్న పోలవరం పాదయాత్రలో అల్లూరి సీతారామ రాజు జిల్లా సీపీఎం నేత, జెడ్పిటిసి దీసారి గంగరాజు, సూడిపల్లి కొండలరావులు పాల్గొని సంఘీభావం తెలిపారు. పాదయాత్ర సందర్భంగా అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, గిరిజన చట్టాలు, హక్కులు ఉల్లంఘించి నిర్వాసిత ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయం పై ఆదివాసులందరు ఐక్య పోరాటాలు నిర్వహించాలన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించిన విధంగా పదిన్నర లక్షల పరిహారం 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికీ ఇవ్వాలన్నారు. ముంపు ప్రాంతంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ప్రతీ ఎకరాకు రూ.20 లక్షలు చెల్లించాలన్నారు.పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు, విద్య, వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు అనంతగిరి యువజన నాయకులు నరాజి సురేష్ పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న గంగరాజు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

మెనూ ప్రకారం ఆహారం పెట్టాలి

- రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం : గిరిజన ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు పెట్టాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని బూసిగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. నిత్యావసర సరుకుల స్టోర్ రూమును, వంటశాలను, రికార్డులను, క్లాస్ రూమ్లను పరిశీలించారు. తాజా కూరగాయలు, వారానికి రెండు రోజులు కోడి మాంసం సరఫరాపై ఆరా తీశారు. తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయులు ఏవిధంగా విద్యార్థులకు పాఠాలు చెపుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. పాఠశాల చుట్టుప్రక్కల చెత్త చెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పిఒ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

3న అల్లూరి శత జయంతి ఉత్సవాల ముగింపు

ప్రజాశక్తి-కొయ్యూరు : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శతజయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఈనెల 3న రాజేంద్రపాలెం అల్లూరి స్మారక మందిరంలో నిర్వహిస్తామని జాతీయ అల్లూరి యువజన సంఘం కార్యదర్శి శ్యామల వరలక్ష్మి, సహాయ కార్యదర్శి మాకాడ బూరులయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు విచ్చేస్తారని పేర్కొన్నారు.

జగనన్న సురక్ష సేవలకు టోకెన్ రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నుంచి ఉచితంగా సర్టిఫికెట్ పొందవలసిన వారు టోకెన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ వెల్లడించారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గత నెల 28 నుంచి సచివాలయంలో ప్రారంభించామని తెలిపారు. టోకెన్ రిజిస్ట్ చేసుకున్న లబ్ధిదారులందరికీ ఈనెల 4న సర్టిఫికెట్లు పరిశీలన, సర్టిఫికెట్లు జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.



జగనన్న సురక్ష టోకెన్లు రిజిస్ట్రేషన్ చేస్తున్న దృశ్యం

కుష్టు నిర్మూలనకు కృషి చేయాలి

డిఎల్ఒ విశ్వేశ్వర నాయుడు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అల్లూరి జిల్లా డీఎల్ఓ విశ్వేశ్వర నాయుడు కోరారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శనివారం డుంబ్రిగుడ, కిల్లోగూడ పిహెచ్సిలో పని చేస్తున్న వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, కనుబొమ్మలోని కను వెంట్రుకలు రాలి పోవడం, అరచేతులు, అరికాళ్ళలో స్పర్శ లేకపోవడంతో పాటు చేతి, కాలు వేళ్ళు వంకర్లు తిరిగి ఉన్నట్లయితే కుష్టు వ్యాధి లక్షణాలని చెప్పారు. వీటిపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజల్లో అవగాహన పరిచి నిర్మూలనకు ప్రత్యేక కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సిల వైద్యాధికారులు కే కరుణ, ప్రేమ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి:స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిణి జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో శనివారం ర్యాలీలో నిర్వహించారు డీఎల్ఓ విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ, వైద్య సిబ్బంది గ్రామస్థాయిలో సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటి సర్వేలు నిర్వహించి వ్యాధి లక్షణాలు గుర్తించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బందికి అవగాహన కల్పించి వ్యాధి అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కోప్ సంస్థ ప్రతినిధి. శివకృష్ణ, స్థానిక వైద్యాధికారి ప్రతాప్, లొంగపర్తి పిహెచ్సి వైద్యాధికారి భార్గవి పాల్గొన్నారు



మాట్లాడుతున్న డిఎల్ఒ విశ్వేశ్వరనాయుడు

విద్యతోనే బంగారు భవిష్యత్తు

- మానవ హక్కుల నేర నిరోధక సంఘం జాతీయ చైర్మన్ రాజేష్ నాయక్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:గిరి విద్యార్థులు బాగా చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మానవ హక్కుల నేర నిరోధక సంఘం జాతీయ చైర్మన్ బోడ రాజేష్ నాయక్ సూచించారు. స్థానిక కేజీబీవీ బాలికల పాఠశాలలో శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైస్కూల్ దశ నుంచి విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి ఒక్క విద్యార్థి బాగా చదివి ఉన్నత స్థాయి ఉద్యోగాలను పొందాలని సూచించారు. కూలి, నాలి చేసి కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల వారి రుణం తీర్చుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళా అధ్యక్షురాలు కే.కృష్ణకుమారి, రాష్ట్ర నాయకుడు కే.జాన్ వెస్లీ, ఎస్.కామయ్య, కేజీబీవీ పాఠశాల ఎస్ఓ సుజాత, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయక్



రేకుల షెడ్డులో ఉన్న పాఠశాల

రేకుల షెడ్లో పాఠశాల

-అవస్థలు పడుతున్న విద్యార్థులు

-పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

ప్రజాశక్తి-హుకుంపేట:నాడు నేడు పనులు నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో విద్యార్థులు నేల పైన విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాల భవనం లేక పోవడంతో తాత్కాలికంగా రేకుల షెడ్ ఏర్పాటు చేసుకొని తప్పని పరిస్థితిలో చదువుతున్నారు.ఇదీ రంగసింగపాడు విద్యార్థుల దుస్థితి. నాడు నేడు కింద పాఠశాలలు సుందరంగా తీర్చి దిద్దుతున్నామంటూ అధికారులు ప్రకటనలు చేస్తున్నారు తప్ప పూర్తిస్థాయిలో పనులు చేపట్టడం లేదని గ్రామ ప్రజలు, స్థానిక సర్పంచ్ వి.లక్ష్మణరావు, విద్యా కమిటీ చైర్మన్ గణేష్, సింహాద్రిలు వాపోయారు. మండలంలోని మెరక చింత పంచాయతీ రంగసింగపాడు జిపిఎస్టి డబ్ల్యూ స్కూలులో పది మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాల భవనం మధ్యలో ఆపి వేయడంతో గ్రామస్తులు ఉపాధ్యాయురాలి సహకారంతో రేకు షెడ్డు నిర్మాణం చేసుకొని అందులోనే పాఠాలు బోధిస్తున్నారు. వర్షాకాలంతో రేకు షెడ్డు లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాల భవనం పూర్తి చేయాలని వారు కోరారు.

హెచ్ఎం, ఉపాధ్యాయులకు సన్మానం



హెచ్ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని పాలమామిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు రజిత డుంబ్రిగుడ మండలం గేదెలబంద పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం పాలమామిడి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. రామ స్వామి మాట్లాడుతూ, ఆమె విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజకుమారి, భువనేశ్వరి, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరకులోయరూరల్:మండలంలోని పెదలబుడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడుగా పని చేస్తూ ఇటీవల బదిలీపై వెళ్తున్న జన్ని సింహాచలంకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.నీలకంఠం, ఉపాధ్యాయులు ఎం.నారాయణరావు, కృష్ణమ్మ, మోహనరావు, గ్రామస్తులు అర్జున్, సద్దు నాయుడు, తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన మత్స్యకారుల శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : వేటాడే సమయంలో ప్రమాదాలు సంభవించేటప్పుడు తమను తాము ప్రాణాల నుంచి ఎలా కాపాడుకోవచ్చు? సహచర మత్స్యకారులను ఎలా కాపాడవచ్చు? అన్న అంశాలపై జివిఎంసి 3వ వార్డు పరిధి బోయివీధి సముద్ర తీరం వద్ద ఆరు రోజుల నుంచి నిర్వహించిన శిక్షణ శిబిరాలతో ముగిసింది. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పిఎంఎంఎస్‌వై) పథకం కింద నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌ఎఫ్‌డిబి) నిధులతో చేపట్టిన శిక్షణలో ఆసక్తి గల 25 మంది మత్స్యకారులు పాల్గొన్నారు. ఐటియుఎస్ కంపెనీకి చెందిన ట్రైనింగ్ డైరెక్టర్ భరత్, ట్రైనర్ సాయితేజ, ఇంఛార్జి ట్రైనర్ కొండలరావు శిక్షణ ఇచ్చారు. ఎఫ్‌డిఒ లావణ్య అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం జరిగింది.

42వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 42వ వార్డు పరిధి రైల్వే న్యూకాలనీ, మసీదు వీధి, కన్నారావు వీధి ప్రాంతాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతిశ్రీనివాసరావుతో కలిసి ఇంటింటికి వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నుంచి సచివాలయాల ద్వారా కొండవాలు ప్రాంతాలు, మురికివాడల్లో లబ్ధిదారులకు విశిష్ట సేవలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, వైసిపి నాయకులు ప్రసాద్, నూకరాజు, నాగమణి, బలిరెడ్డి గోవింద్, హరిపట్నాయక్, వసంతల అప్పారావు, బోగవల్లి గోవింద్, షేక్ బాబ్జి, మహాదాస్య గోపి, సమ్మెట్ల వెంకటేష్, 42వ వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కథ కచేరి' స్వీయ పఠనం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ సాహితీ ఆధ్వర్యాన లలిత పీఠంలో 'కథ కచేరి' స్వీయ కథ పఠన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదిహేను మందికి పైగా రచయితలు వారి స్వీయ రచన కథలను చదివి వినిపించారు. అన్ని కథలూ ప్రేక్షకులను, ఆలోచింపజేశాయి. ఈ సందర్భంగా విశాఖ సాహితీ అధ్యక్షులు ఆచార్య కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ, సాహిత్య ప్రక్రియలలో కథకు సముచితమైన స్థానం ఉందన్నారు. సామాన్య మానవులను సైతం ఆలోచింపజేసే శక్తి ఒక్క కథకే ఉంటుందని తెలిపారు. ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు మాట్లాడుతూ, సమాజ స్థితిని, గతిని మార్చే శక్తి కథలకు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరి జీవితాన్ని ఏదో సందర్భంలో కథలు ప్రభావితం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ సాహితీ ఉపాధ్యక్షులు డాక్టర్ కందాళ కనకమహలక్ష్మి, డాక్టర్ డి.వి.సూర్యారావు, ఆచార్య పాండురంగ విఠలమూర్తి, కార్యదర్శి శంకర్ నీల భాగవతుల, సంస్థ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదంపై విచారణ చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-నక్కపల్లి: అచ్యుతాపురం సెజ్‌లోని సాహితీ ఫార్మాలో రియాక్టర్ పేలిన ఘటనలో మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ,కంపెనీ యాజమాన్యం ఈ ఘటనకు సంబంధించిన విషయాలను గోప్యంగా ఉంచిందని, ఏ షిఫ్టులో ఎంత మంది కార్మికులు పనిచేస్తున్నారో అన్న వివరాలు వెల్లడించలేదని తెలిపారు. ప్రమాదాలు జరిగిన ఫార్మా కంపెనీలపై రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోక పోవడంతో యాజమాన్యాలు తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. అచ్యుతా పురం, పరవాడ సెజ్‌లో తరుచూ ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వాటిని నివారించే చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గ మన్నారు.ప్రభుత్వ యంత్రాంగం యాజమాన్యాలతో కుమ్మక్కై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు.ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరిగినప్పుడు మంత్రులు హడావిడి చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత నివారణా చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ప్రమాదంపై స్పందించి సమగ్రమైన విచారణ జరిపి కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని ఉపమాక గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం వ్యవసాయ సహాయకులు కంబాల రాజు రైతులకు వరి విత్తనాలను అందజేశారు. రైతుల ఆధార్, భూమి వివరాలు నమోదు చేసుకుని విత్తనాలను సరఫరా చేస్తున్నారు.

చర్యల్లేని విచారణలు.. ఎవరి కోసం.. ?

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉత్పత్తి వ్యయం కంటే ఎక్కువ రేటుకు అంగట్లో సులువుగా సరుకు అమ్ముకొనే నేర్పరుల దృష్టిలో మనిషి ప్రాణమూ ఒక సరుకే. తన కంపెనీలోని ప్రతి వస్తువుకూ ఒక నిర్ణీత రేటు ఉన్నట్లు మనిషి అవయవానికీ (గాయాల తీవ్రతను బట్టి) ధర ఉంటుంది. బ్రాండ్ లేదా గిరాకీని బట్టి వస్తువు ధర ఉన్నట్లే కంపెనీ స్థాయిని బట్టి ఇక్కడ ప్రాణానికి రేటు కట్టడం మారుతూ ఉంటుంది. ప్రమాదం జరిగిన ప్రతిసారీ మనకు ఎక్స్‌గ్రేషియా రూపంలో ఈ ధరలు బయటపడుతుంటాయి. అడిగేవారు లేకపోతే ఎంతోకొంత చెల్లించి వదులుకోవాలని యాజమాన్యాలు చూస్తుంటాయి. ఇక్కడ వ్యాపారం తప్ప మానవత్వమే కనబడదు. తన తప్పిదం, నిర్లక్ష్యం వల్ల ప్రాణం పోయిన కార్మిక



కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం మానవత్వంగా పారిశ్రామికాధిపతులు, వీరి ప్రయోజనాలు కాపాడే ప్రభుత్వాలు చెప్పుకుంటాయి.

కుటుంబ భారాన్ని, బాధ్యతను తన భుజస్కందాలపై మోసిన వ్యక్తి ఇంట్లో లేకపోతే ఆ బరువు ఎవరు మోస్తారు ? ఆ బాధ్యత ఎవరు పడతారు ? అన్న ఇంకితం లేకుండా యాజమాన్యాలు, ప్రభుత్వాలు మాట్లాడుతున్నాయి. ప్రవర్తిస్తున్నాయి. పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలతో జరిగిన మరణాలను హత్యాలుగానే భావించాల్సివుంది. ఎందుకంటే యాజమాన్యాల ఉద్దేశ పూర్వక తప్పిదాలు వల్ల కోల్పోతున్న ప్రాణాలివి. శుక్రవారం అచ్యుతాపురం సెజ్ ప్రాంతంలోని డి నోటిపై ఏరియాలో సాహితీ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో గాయాలైన ఏడుగురిలో ఇద్దరు చనిపోయారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంపై విచారణకు ఆదేశించకుండా ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఈ ప్రమాదంపై కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి విచారణకు ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ జాహ్నవి నేతృత్వాన వేసిన కమిటీ విచారణలో ఏమి తేల్చుతారో, యాజమాన్యంపై ఏ చర్య తీసుకుంటారో తెలీదుగానీ ప్రభుత్వ యంత్రాంగం నిర్వహిస్తున్న విచారణలపై విశ్వాసం సన్నగిల్లిపోతోంది. గతంలో పరిశ్రమల ప్రమాదాలపై వేసిన విచారణ కమిటీలు ఇచ్చిన నివేదికలు బహిర్గతం చేయకపోవడం, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోకపోవడం అపనమ్మకానికి ప్రధాన కారణం.

పరిశ్రమలను ప్రోత్సహించడం అంటే యాజమాన్యాల తప్పులను వెనుకేసుకురావడం కాకూడదు. కార్మికుల భద్రతకు పెద్దపీట వేసేలా చూడాలి. భద్రతపై నిర్లక్ష్యం ప్రదర్శించిన యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ప్రమాణాలు పాటించకపోతే పరిశ్రమను నడపలేమన్న భయం కలిగించాలి. పరవాడ ఫార్మాలోని లారస్ ల్యాబ్ మూడో యూనిట్, ఆరో బ్లాకులో జరిగిన ప్రమాదం, నక్కపల్లి హెటిరో డ్రగ్స్, సాయినార్, స్మైల్ ఎక్స్ కంపెనీ, బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సెటీలో సీడ్స్ కంపెనీలో 2022 జూన్ 3, ఆగస్టు 2 తేదీల్లో జరిగిన ప్రమాదాల్లో యాజమాన్య వైఫల్యాలను అధికారులు ఎత్తిచూపారు. అయినా వారిపై చెప్పుకోదగ్గ చర్యల్లేవు. 2020 మేలో విశాఖ నగరంలోని గోపాలపట్నం వద్ద ఎల్‌జి పాలిమర్స్‌లో జరిగిన ప్రమాదంలో 12 మంది మృతిచెందినప్పుడు ప్రభుత్వం పరిశ్రమల్లో తనిఖీలకు అదేశించినపుడు ఉమ్మడి జిల్లాలో 121 పరిశ్రమల్లో లోపాలున్నట్లు గుర్తించారు. అయినప్పటికీ లోపాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించలేదు. ఈ ఉదాసీనత తరుచూ ప్రమాదాలకు, కార్మికుల మరణాలకు, గాయాలు పాలుకావడానికి దారితీస్తోంది.

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో ఆధార్ నమోదు కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆధార్ కార్డుల్లో తప్పొప్పులు సరి చేసుకోవడానికి ఆధార్ సెంటర్ సీలేరులో లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. నిరుపేద గిరిజనులు ఆధార్ కార్డులు తప్పొప్పులు సరిచేసుకోవాలన్న మైదాన ప్రాంతానికి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీలేరులో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసే విధంగా జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

'ఉక్కు' పరిరక్షణకు ఎంతటి పోరాటానికైనా సిద్ధం

ప్రజాశక్తి - ఉక్కునగరం : రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నట్లు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 870వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్ - 1 విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడారు.

జగనన్న సురక్ష ప్రారంభం

ప్రజాశక్తి -యంత్రాంగం:

పాడేరు: జగనన్న సురక్ష కార్యక్రమం మొదటిరోజు విజయవంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా మొదటి రోజైన శనివారం 11 మండలాల పరిధిలో గల సచివాలయాలలో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ 19 సచివాలయాల పరిధిలో 18,341 గృహాల నుండి వాలంటీర్ల యాప్‌లో వివిధ ధ్రువ పత్రాల కోసం 21,070 విజ్ఞప్తులు రాగా, 12,608 టోకెన్లు జనరేట్ అయ్యాయని, అందులో 8,917 దరఖాస్తులు ఆన్లైన్ చేయగా రాత్రి 8 గంటల సమయానికి 5,028 ధ్రువపత్రాలు పంపిణీ చేయడం జరిగిందని, మిగిలిన 3,889 ధ్రువపత్రాలను జారీ చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.



అనంతగిరిలో మాట్లాడుతున్న సూర్య కుమారి

అనంతగిరి: జగనన్న సురక్ష కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఎంపీపీ శెట్టి. నీలవేణి అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా శిశు సంక్షేమ శాఖ మండల ప్రత్యేక అధికారిణి ఎన్.సూర్య కుమారి మాట్లాడుతూ, జగనన్న సురక్ష విజయవంతానికి ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వివి .కుమార్, తహాశీల్దార్ రంబాయి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో పెదలువ్వాసింగి పంచాయితీలో ప్రతిష్టత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ, 11రకాల ప్రభుత్వ సేవలను మారుమూలలలో ఉన్న ప్రతి పేదవాడికి అందేలా సచివాలయం సిబ్బంది, కన్వీనర్లు, వాలంటీర్లు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు పాల్గొన్నారు

అడ్డతీగల : మండల కేంద్రంలోని అడ్డతీగల సచివాలయం-1లో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. స్థానిక తహశీల్దారు తాతారావు, ఎంపీడీవో బాపన్న దొర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 263 దరఖాస్తులు తీసుకుని ఆన్లైన్ చేశారు. వీటిలో కుల ధ్రువీకరణ పత్రాలు 14, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు 82 పంపిణీ చేశారు. మిగినవి ఆన్‌లైన్ ప్రక్రియలో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పప్పుల చిట్టెమ్మ, ఎంపిటిసి ఈశ్వరి, వైస్ సర్పంచ్ ముప్పనశెట్టి శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి రాఘవన్, ఈవోపీఆర్డి చిన్నబ్బులు, వార్డు మెంబర్లు, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



విఆర్.పురం మండలం రేఖపల్లిలో ధ్రువపత్రాలు అందిస్తున్న ప్రతినిధులు

విఆర్.పురం : జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలోని రేఖపల్లి సచివాలయంలో -1 శనివారం నిర్వహించారు. ఇందులో రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజినీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సర్పంచ్ సరోజినీ, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి చేతులు మీదుగా సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.శ్రీధర్, ఇఒపిఆర్‌డి వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, వైసిపి నాయకులు బొడ్డు సత్యనారాయణ, చిక్కాల బాలు, మాదిరెడ్డి సత్తిబాబు, రేవు బాలరాజు, రెడ్డిమల్ల శ్రీను, రేఖపల్లి కార్యదర్శి జి.శివ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని శరభవరం, బడదనాంపల్లి సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. శరభవరంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, ఎంపిడిఓ ఎల్ యాదగిరేశ్వరావు, డిప్యూటీ తహసీల్దార్ ఏ సత్యనారాయణ, ఏపీఎం ఆదినారాయణ, బడదనాంపల్లిలో జెడ్పిటీసీ ఒడుగుల జ్యోతి, తహసీల్దార్ సీహెచ్ సుబ్రహ్మణ్య ఆచార్యులు, ఈఓపిఆర్డీ శ్రీనివాసరావు, ఏపిఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు. వివిధ అర్జీలకు సంబంధించిన పత్రాలను అక్కడ అక్కడే మంజూరు చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సిహెచ్ చంద్రరాణి, సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి రామకృష్ణ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలో రావణపల్లి సచివాలయంలో తహసీల్దార్ తిరుమలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, ఏఎంసీ ఛైర్పర్సన్ జైతి రాజులమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమం ప్రారంభించారు. వైసీపీ మండల అధ్యక్షుడు బాబులు, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ అనీమియాను నిర్మూలించాలి

.ప్రజాశక్తి-జి.మాడుగుల: గిరిజన ప్రాంత ప్రజలను వేధిస్తోన్న సికిల్ సెల్ అనీమియా సమస్యను పూర్తిగా పారదోలాలని, దీకి ప్రతి ఒక్కరూ సహకరించాలని వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, జి.మాడుగుల జెడ్పీటీసీ మత్స్యరాస వెంకటలక్ష్మి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సికిల్ సెల్ అనీమియా నిర్మూలనకు శ్రీకారం చుట్టాయి. ఈ కార్యక్రమాన్ని జి.మాడుగుల పీహెచ్‌సీలో వెంకటలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ప్రభుత్వం సికిల్ సెల్ అనీమియా బాధితులను ఆదుకోవడం కోసం ప్రత్యేకంగా రూ.10వేల పింఛను అందిస్తున్నారు. దేశంలో ఎక్కడా ఈ తరహాలో సికిల్ సెల్ అనీమియా బాధితులకు సాయం అందించిన దాఖలాలు లేవన్నారు.



సికిల్‌సెల్ అనీమియాపై మాట్లాడుతున్న వెంకటలక్ష్మి తదితరులు

విత్తన కొరత

భరోసా కేంద్రాల నుంచి వెనుదిరుగుతున్న రైతులు
సిద్ధం చేసిన నారుమడులు
వర్షాలు పడితే ఆకుపోత

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాకు వరి విత్తనాలు సరిపడా రాలేదు. 11 రకాల వరి విత్తనాలు 23,387 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపగా 15,364 క్వింటాళ్ల రైతు భరోసా కేంద్రాలకు చేరాయి. విత్తనాలు సరిపడా రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు పడితే ఆకులు పోయడానికి వారంతా మడులు సిద్ధంచేశారు. కొంతమంది రైతులు నీటి వనరులున్నచోట నారుపోశారు. వర్షాలు పడితే విత్తనాలకు ఒక్కసారి డిమాండ్ పెరగనుంది. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నుంచి మండలాలకు విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నా, రైతు భరోసా కేంద్రాలకు వెళ్లిన రైతులు విత్తనాల్లేక వెనుదిరుగుతున్నారు.

ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,45,655 ఎకరాలు ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వరి సాగుకు సరిపడా 23,387 క్వింటాళ్ల వరి

వరి విత్తన ప్రతిపాదనలు, వచ్చినవి (క్వింటాళ్లలో)

వరి విత్తనం	ప్రతిపాదన	వచ్చినవి
ఆర్‌జిఎల్ 2537	15,457.00	9644.70
ఎంటియు 1064	2294.00	1323.00
ఎంటియు 1061	727.00	543.90
బిపిటి 5204	2152.00	1670.00
బిపిటి 3291	1419.50	991.80
ఎంటియు 7029	435.00	333.30
ఎంటియు 1121	590.00	765.90
ఎన్‌ఎల్‌ఆర్ 34449	12.00	13.80
ఆర్‌ఎన్‌ఆర్ 15048	51.00	24.50
ఎంటియు 1224	100.00	2.40
ఎంటియు 1318	150.00	50.00
మొత్తం	**23,387.50**	**15,364**



తాళ్లపాలెం ఆర్‌బికె నుంచి వరి విత్తనాలు తీసుకెళ్తున్న రైతులు

విత్తనాలకు ప్రతిపాదనలు పంపింది. ఖరీఫ్ ప్రారంభానికి విత్తనాలు అందిస్తామని ప్రభుత్వం చెప్పినా ఆ సమయానికి విత్తనాలు అందించలేకపోయింది. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు లేకపోవడంతో రైతులు కొందరు ప్రయివేటు వ్యాపారుల వద్ద కొనుక్కొంటున్నారు. మరికొంతమంది రైతులు తయారుచేసిన విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు.

కేజీకి పది రూపాయల చొప్పున 30 కేజీల వరి విత్తనాల బ్యాగుకు మూడు వందల రూపాయల రాయితీపై రైతుకు భరోసా కేంద్రాల్లో ఇస్తున్నారు. ఆధార్ కార్డు పట్టుకొని రైతు భరోసా కేంద్రాలకు రైతులు వెళితే సమాచారం నమోదు చేసుకొని ఎకరాకు ఒక బ్యాగు చొప్పున గరిష్టంగా నాలుగు ఎకరాలకు నాలుగు బ్యాగుల వరకు ఇస్తున్నారు. నాలుగు ఎకరాలకు మించి అవసరమైతే రైతు బయట విత్తనాలు కొనుక్కోవాల్సివుంది.

పెసర, మినుములు, కందులు, వేరుశనగ విత్తనాలు కేజీ కూడా జిల్లాకు చేరలేదు. మినుములు ఐపియు - 2 - 43 విత్తనాలు 20 క్వింటాళ్లు, పెసర ఐపిఎం - 2 - 14 విత్తనాలు 20 క్వింటాళ్లు, కందులు ఐఆర్‌జి 52 - 35 క్వింటాళ్లు, వేరుశనగ 35 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపగా విత్తనాభివృద్ధి సంస్థ నుంచి అసలు రాలేదు.

గిరిజన, దళిత సాగుదారులకు న్యాయం చేయండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - రావికమతం : ఉర్లోవ రెవెన్యూ పరిధిలో జీడి మామిడి తోటలపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులు, దళితులు, ఇతర పేదలకు వెబ్‌ల్యాండ్ రికార్డుల విషయంలో న్యాయం చేయాలని, సాగు హక్కు కల్పించాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. శనివారం ఆయనతో పాటు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు కె.గోవిందరావులతో కూడిన ప్రతినిధి బృందం తొలుత కొమిరి గ్రామంలో సమావేశమైంది. అనంతరం ఉర్లోవ కొండకు పాదయాత్రగా వెళ్లారు. దళితులు, గిరిజనులు, ఇతర పేదలు వేసుకున్న తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా సాగుదారులు తమ కష్టాలను నాయకులకు చెప్పుకున్నారు. 'రావికమతం మండలం కొమిరి గ్రామంలో 150 మంది గిరిజనులు, దళితులు, ఇతర పేదలకు ఉర్లోవ రెవెన్యూ పరిధిలో వి.మాడుగుల మండలంలో 2013లో ఐదు, ఆరు విడతల్లో 300 ఎకరాలకు డి - పట్టాలు పంపిణీ చేశారు. 2014 వెబ్ ల్యాండ్ రికార్డు నమోదైన తరువాత ఉర్లోవ రెవెన్యూ విలేజ్ మ్యాప్ ఉన్నప్పటికీ సెటిల్‌మెంట్ రికార్డు లేదు. దీంతో వెబ్‌ల్యాండ్ రికార్డులో ఈ రెవెన్యూ విలేజ్ నమోదు కాలేదు. దీంతో అన్‌సెటిల్ విలేజ్‌గా ఈ ప్రాంతం ఉండిపోయింది. దీంతో పట్టాలు ఉన్నా ఫలితం లేకండా పోయాయి' అని పలువురు వాపోయారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ స్వయంగా సమస్యపై విచారణ జరిపి డి - పట్టా సాగుదారులందరినీ వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇస్తున్నటువంటి అన్ని సంక్షేమ పథకాలనూ ఉర్లోవ రెవెన్యూ పరిధిలో వారికి అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మీ భూమి - మా హామీకి కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నా ఉర్లోవ రెవెన్యూ అన్‌సెటిల్డ్ విలేజ్ కావడంతో సాగుదారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు.

నేరాలు ఘోరాలు

కారు బోల్తా : ఒకరు మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు మార్టిన్ క్లే రెస్టారెంట్ మలుపు వద్ద శుక్రవారం రాత్రి సుమారు 11 గంటలు దాటాక అదుపు తప్పి కారు బోల్తా పడిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. కారు డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. భీమిలి ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు కథనం ప్రకారం... మధురవాడ నుంచి అతి వేగంగా భీమిలి వైపు వస్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు వెనుక కూర్చున్న విజయనగరం జిల్లా బొబ్బిలి సోమావారి వీధికి చెందిన గుంటిరెడ్డి ఉదయ్ కుమార్ (27) తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవ్ చేస్తున్న మధురవాడకు చెందిన కె.యధుభూషణరావు, కారులో ప్రయాణిస్తున్న కె.వెంకటరమణ, కె.శ్రావణ్‌కుమార్, సింహాచలం, శ్రీనివాసనగర్‌కు చెందిన నాగపూరి ఆనంద రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఆనందరాజు భీమిలి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా, మిగిలిన ముగ్గురు గీతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆనందరాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- కోటవురట్ల: ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో సుంకపూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పారుపల్లి చక్రపాణి(19) ఐటిఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చక్రపాణి మద్యానికి బానిస కావడంతో శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో, మనస్థాపానికి గురై సమీపంలో పశువుల పాక వద్ద చెట్టుకు రాత్రి సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆరు కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- చీడికాడ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని 6కిలోలు స్వాధీన పరుచుకున్నట్లు స్థానిక ఎస్సై పి రామారావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చీడికాడ మండలం అప్పలరాజుపురం గ్రామ సమీపంలో ఎస్సైకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. విజయరామరాజుపేటకు వెళ్ళుటకు సిద్ధంగా ఉన్న అనుమానాస్పద వ్యక్తుల లగేజ్ బ్యాగ్‌ను తనిఖీ చేయగా 6 కేజీల గంజాయి లభ్యమయ్యిందన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరిలో ఐదుగురు తమిళనాడుకు చెందిన వారు కాగా, ఒకరు పెదబయలుకు చెందినవారని ఎస్ఐ తెలిపారు.

ఇదిలా ఉండగా మరో ఘటనలో కోనాం చెక్ పోస్ట్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని 9 బీర్ బాటిల్‌లు సీజ్ చేసి వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై రామారావు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం, గంభీరం పంచాయతీ బోయిపాలెం బ్రిడ్జి ఈస్టర్ విశాఖ పాఠశాల పక్కన గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. బోయపాలెం బ్రిడ్జి పక్కన ఓ వృద్ధుడు మృతి చెందిఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 65 నుంచి 70 సంవత్సరాలు వయసు ఉంటుందని నిర్ధారించారు. స్థానికంగా భిక్షాటన చేసేవాడని కొంతమంది తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- పెందుర్తి : 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెం వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... పెందుర్తి వైపు నుంచి జీడి ప్రసాదరావు సన్యాసమ్మ ద్విచక్రవాహనంపై వస్తుండగా పాపారాయపాలెం పెట్రోల్ బంకు వద్ద కుక్క అడ్డు రావడంతో బ్రేక్ వేశారు. అదే సమయంలో వెనుక నుంచి నుంచి వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరూ కొంత దూరం వెళ్లి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో హాస్పిటల్‌కు తరలించారు.



ధర్నా చేస్తున్న సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు

అదనపు విద్యుత్ ఛార్జీలపై సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న అదనపు విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు పొత్తూరు సత్యనారాయణ, పి.రామరాజు, టి.శ్రీను తదితరులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ప్రజలకు కరెంట్ బిల్లు చుడగానే షాక్ కొట్టే విధంగా ఉందని తెలిపారు. ఇప్పటికే స్లాబులు మార్చి భారం మోపారని, ఇప్పుడు ప్రజల కళ్ళు కప్పి పది సంవత్సరాల కాలంలో వాడుకున్న కరెంటుకు బల్లులు కట్టినా మల్లి సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజల నెత్తిన వచ్చే నాలుగేళ్లలో రూ.31 వేల కోట్ల భారం ప్రజలపై మోపనున్నారని తెలిపారు. ప్రభుత్వాన్ని విద్యుత్ రంగాన్ని అదాని కంపెనీలకు కట్టాబెడుతున్నారని మండిపడ్డారు. ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించాలని, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణల చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రత్తిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు. ఈ ధర్నాలో సిపిఎం నాయకులు జర్తా రాజు, మణుగుల రాజుబాబు, మణుగుల కృష్ణ, జర్తా కుశల, ఈశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

జియో సేవలు మరింత విస్తృతం

ప్రజాశక్తి- సీలేరు : జియో సేవలు మరింత విస్తరించనున్నామని ఆ సంస్థ మేనేజర్ సత్యనారాయణ వెల్లడించారు. శనివారం ఆయన ప్రజాశక్తితో ఫోన్లో మాట్లాడుతూ జీకే వీధి మండలం సీలేరులో ఏడాది క్రితం జియో 4జి టవర్ ఏర్పాటు చేసి వినియోగదారులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. శనివారం నుంచి 5జి సేవలు సీలేరులో వినియోగదారులకు అందించే విధంగా సెల్ టవరుకు పరికరాలు తమ సిబ్బంది అమర్చడం జరిగిందని పేర్కొన్నారు. 5జి సేవలు వలన నెట్ స్పీడ్ పెరుగుతుందని, ఎటువంటి అంతరాయం ఏర్పడదని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు, చింతపల్లి, హుకుంపేట, ముంచంగిపుట్టు తదితర ప్రదేశాల్లో 5జి సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. మారుమూల గిరిజన గ్రామాల్లో జియో టవర్లు ఏర్పాటు జియో నెట్ వర్క్ సెల్ సిగ్నల్ సేవలు ప్రజలకు అందుబాటులో తీసుకురావడానికి జియో యాజమాన్యం అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు.

7న ఉచిత వైద్య శిబిరం, వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు, మంప పోలీసుల ఆధ్వర్యంలో ఈ నెల 7న కొయ్యూరు మండలం యు.చీడిపాలెం పంచాయతీ పరిధి పలకజీడి గ్రామంలో మెగా వైద్య శిబిరం, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కొయ్యూరు సిఐ స్వామినాయుడు తెలిపారు. మండలం మారుమూల పంచాయతీలైన యు.చీడిపాలెం, మఠం భీమవరం, బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరానికి చిన్నపిల్లల వైద్య నిపుణులు, గైనిక్, నేత్ర, సాధారణ, హృదయ వైద్య నిపుణులు విశాఖకు చెందిన లోటస్ హాస్పిటల్, అను హాస్పిటల్, హెచ్‌సిజి హాస్పిటల్ తదితర ఆసుపత్రుల నుండి వస్తున్నారు తెలిపారు. యువత కోసం వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని, ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు అందజేయనున్నట్లు చెప్పారు. వాలీబాల్ టీమ్స్ సంబంధించిన కెప్టెన్లు వాళ్ళ వివరాలను కొయ్యూరు, మంప పోలీస్ స్టేషన్లలో ఇవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు కొయ్యూరు సిఐ9440904218, కొయ్యూరు ఎస్ఐ 9440904241, మంప ఎస్ఐ 9440904217 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.